నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, గురువారం 21 నవంబర్ 2024 | KAMAREDDY

ట్రెజరీ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేస్తున్న టీపీటీఎఫ్ ఉద్యోగ సంఘం నేతలు

# 'ఖజానా'లో దొంగలు

- కోశాగారంలో స్వాహా పర్వం
- అవినీతికి నిలయంగా కామారెడ్డి ట్రెజరీ కార్యాలయం
- బరితెగించిన కొంత మంది సిబ్బంది
- కొత్తగా చేరిన ఉద్యోగుల నుంచి వసూళ్లు
- ఫోన్ పే, గూగుల్ పే నంబర్లకు పేమెంట్స్
- నూతన ఉద్యోగులకు ఎంప్లాయిఐడీ తిప్పలు

నిజామాబాద్, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కామారెడ్డి 'ఖజానా'లో పని చేసే కొందరు బరితెగించారు. కార్యాలయానికి వచ్చే వారి నుంచి అక్రమ వసూళ్లకు తెర లేపారు. జీతభత్యాలు, పింఛన్ మంజూరు చేయడంలో ట్రెజరీ శాఖదే కీలక పాత్ర. కలెక్టర్ మొదలుకుని కింది స్థాయి అటెండర్ వరకు ఎవరికైనా ఏ బిల్లు మంజూరు కావాలన్నా ఖజానా శాఖ తలుపు తట్టాల్సిందే. ఇదే అదనుగా భావిస్తున్న ట్రెజరీ శాఖలోని సిబ్బంది కొందరు బిల్లులకు సంబంధించిన ఫైళ్లను కదిపేందుకు చేయి చాస్తున్నారు. పైకం ఇవ్వకుంటే ఫైలు ముందుకు కదపరనే అపవాదును మాటగట్టుకున్న ఇక్కడి సిబ్బంది.. ఉద్యోగులనే కాదు, రిటైర్డ్ ఉద్యోగులతో పాటుగా కొత్తగా జాబుల్లో చేరిన వారినీ వదలడం లేదు. తమ వసూళ్ల దందాలో కొత్త, పాత అనే తేడా లేకుండా అందరి వద్ద వసూళ్లు చేస్తున్నారు. లేదంటే ముప్పు తిప్పలు పెడుతున్నారు. కామారెడ్డి ట్రెజరీలో బహిరంగంగానే వసూళ్ల పర్వం కొనసాగుతున్నప్పటికీ పట్టించుకునే వారు కరువయ్యారు. కలెక్టరేట్ ప్రాంగణంలోనే ఈ ఆఫీస్‌లో పని చేసే కొందరు ఉద్యోగులు.. పొద్దున ఆఫీస్ మెట్లు ఎక్కిన కాడి నుంచి మొదలు తిరిగి విధులు ముగించుకునే దాకా వసూళ్లలోనే మునిగి తేలుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### ఎంప్లాయ్ ఐడీకి రూ.300..

డీఎస్సీ 2024లో ఉపాధ్యాయులుగా ఎంపికైన వారి నుంచి.. ఎంప్లాయ్ ఐడీ కోసం వసూళ్లు చేస్తున్నారు. ఒక్కొక్కరికీ రూ.300 చొప్పున బేరం పెట్టారు. బహిరంగంగానే ఫోన్ పే, గూగుల్ పేలు సైతం ఆఫర్ అందిస్తున్నారు. ఆగస్టు నెలలో ఓ మహిళా టీచర్ పదవీ విరమణ చేశారు. సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలలకు సంబంధించిన ఎరియర్స్‌తో పాటు డిసెంబర్ నుంచి రెగ్యులర్‌గా వచ్చే పింఛన్ రావాల్సి ఉంది. డబ్బులు ఇవ్వనిదే ఫైల్ ముందుకు పోదని ట్రెజరీ సిబ్బంది సదరు రిటైర్డ్ ఉపాధ్యాయురాలికి నేరుగానే చెప్పేశారు. పింఛన్ ఇప్పట్లో రాదంటూ ఖరాకండిగా చెప్పడంతో ఆమె లబోదిబోమనాల్సి వచ్చింది. మరో శాఖకు చెందిన ఉద్యోగికి తన కూతురు పెళ్లి నేపథ్యంలో అత్యవసరంగా డబ్బులు అవసరమయ్యాయి. చేసేది లేక తన జీపీఎఫ్ నుంచి కొంత మొత్తం డబ్బులు విత్ డ్రా చేసుకోవాలని సంబంధిత ఫారాలన్నీ నింపి అందజేశాడు. డబ్బులు మంజూరయ్యే సందర్భంలో ట్రెజరీ కార్యాలయానికి ఫైల్ చేరింది. ఒక్క సంతకంతో కావాల్సిన పనికి ఒకటికి పది సార్లు తిరిగినా పట్టించుకోలేదు. దీంతో విసిగిపోయిన సదరు ఉద్యోగి తమ సంఘం నేతకు సమాచారమిచ్చాడు. సదరు ఉద్యోగ సంఘం నాయకుడు జోక్యం చేసుకోవడం, మామూళ్ల వ్యవహారాలు నడపడంతో ట్రెజరీలో ఫైలు ముందుకు కదిలింది. ప్రమోషన్లు వచ్చి ఈ మధ్యే బిల్లులు పెట్టుకున్న కొంత మంది ఉపాధ్యాయులకు ఖజానా శాఖ సిబ్బంది నేరుగా ఫోన్లు చేసి మరీ రూ.500 చొప్పున డబ్బులు డిమాండ్ చేయడం గమనార్హం. ఎల్లారెడ్డి, బాన్సువాడ ట్రెజరీల్లోనూ ఇలాగే అవినీతి జరుగుతున్నదని ఉద్యోగులు వాపోతున్నారు.

### ట్రెజరీలో అవినీతి సిగ్గుచేటు..

కామారెడ్డి జిల్లా ట్రెజరీ కార్యాలయంలో జరుగుతున్న అక్రమ వసూళ్లపై అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లాం. ఉద్యోగ విరమణ నుంచి మొదలు పెడితే పెన్షన్ ప్రపోజల్స్ పంపడం దాకా డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. 2024 డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు ట్రెజరీ ఐడీ కేటాయించడానికి కూడా డబ్బులు తీసుకోవడం దారుణం. ఇదే విషయాన్ని అసిస్టెంట్ డైరెక్టర్‌కు విన్నవించాం.

- చకినాల అనిల్,
టీపీటీఎఫ్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు

### ఏండ్లు గడిచినా మారని తీరు..

కామారెడ్డి జిల్లా ట్రెజరీ కార్యాలయం అవినీతికి మారు పేరుగా నిలిచింది. జిల్లా ఏర్పాటు నుంచే అవినీతి రోగం పట్టుకున్నది. గతంలో ఇక్కడ పని చేసిన జిల్లా ట్రెజరీ అధికారులను పూర్వపు కలెక్టర్లు తీవ్ర స్థాయిలో మందలించిన ఘటనలు అనేకం ఉన్నాయి. అయినప్పటికీ వసూళ్ల పర్వంలో డీటీవోలో మార్పు రావడం లేదు. ఇందులో ఉద్యోగ సంఘం పేరు చెప్పుకునే ఓ వ్యక్తి సైతం అవినీతిని పెంచి పోషిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఎవరైనా ఎదురు తిరిగితే సంఘం పేరుతో బెదిరిస్తున్నట్లు చెబుతున్నారు. ట్రెజరీ కార్యాలయంలో జరుగుతున్న అవినీతికి.. అన్ని శాఖల ఉద్యోగులూ బాధితులుగానే మారారు. అవినీతిని సహించని కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ కార్యాలయానికి కూత వేటు దూరంలోనే అక్రమ వసూళ్ల పర్వం నడుస్తుండడం గమనార్హం. ఉన్నత ఉద్యోగుల కళ్లు గప్పి మరీ వసూళ్లు చేస్తున్న ఈ వ్యవహారంపై నిష్పక్షపాతంగా విచారణ చేస్తే వీరి బాగోతాలు వెలుగు చూస్తాయని బాధితులు చెబుతున్నారు.

సిద్ధాపూర్ క్వారీ నుంచి వచ్చే ఇసుక ట్రాక్టర్‌ను తమ పొలాల వద్ద నిలిపివేస్తున్న రైతులు, ఆగ్రహం వ్యక్తంచేస్తున్న మహిళ

# ఇసుక ట్రాక్టర్ల అడ్డగింత

- పైపులైన్లు పగిలిపోతున్నాయని, పంటలు పాడవుతున్నాయని రైతుల ఆగ్రహం
- ఉదయం నుంచి నిలిచిపోయిన ఇసుక ట్రాక్టర్లు
- 'నమస్తే తెలంగాణ' కథనంతో రైతాంగంలో కదలిక

బోధన్, నవంబర్ 20 : మంజీరా నదిలోని బోధన్ మండలం సిద్ధాపూర్ వద్ద ఉన్న ఇసుక క్వారీ ట్రాక్టర్లను రైతులు బుధవారం అడ్డుకున్నారు. సిద్ధాపూర్ గ్రామ సమీపంలోని ఇసుక క్వారీ నుంచి ఇసుకను తీసుకువస్తున్న ట్రాక్టర్లను సిద్ధాపూర్ గ్రామ రైతులు అడ్డుకున్నారు. వీరిలో మహిళా రైతులు ముందుండి తమ పొలాల వద్ద ఇసుక లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్లను నిలిపివేశారు. క్వారీ నుంచి వచ్చే ఇసుక ట్రాక్టర్లతో తమ పంట పొలాలకు ఫిల్టర్ పాయింట్స్ (తక్కువ లోతు బోరువెల్స్) నుంచి వచ్చే పైపులైన్లు పగిలిపోతున్నాయని, పొలాల గట్లు తెగిపోతున్నాయని ఆందోళనకు దిగిన రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇసుక ట్రాక్టర్ల ద్వారా వచ్చే దుమ్ము, ధూళితో పొగాకు దెబ్బతింటున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. కోతలు పూర్తయిన వరి పొలాల రైతులు కూడా ఇసుక ట్రాక్టర్ల ద్వారా నేల గట్టిపడి ఇబ్బందులు పడుతున్నామన్నారు. రైతుల ఆందోళనతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ట్రాక్టర్లు క్వారీలోనే నిలిచిపోయాయి. క్వారీకి సంబంధించిన నిర్వాహకులు, ట్రాక్టర్ల యజమానులు రైతులను బతిమిలాడినప్పటికీ, ఇసుక ట్రాక్టర్లు బయటికి వెళ్లడానికి సాయంత్రం వరకు ఒప్పుకోలేదు. చివరికి రైతులతో చర్చలు జరపడంతో సాయంత్రం సమస్య పరిష్కారమయ్యింది. మరోసారి ఇసుక ట్రాక్టర్లు వస్తే ఊరుకోబోమని రైతులు హెచ్చరించారు.

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

## క్వారీల్లో సబ్ కలెక్టర్ తనిఖీలు

### ఇసుక ట్రాక్టర్ల వే బిల్లుల పరిశీలన

బోధన్, నవంబర్ 20: బోధన్ మండలం సిద్దాపూర్‌లోని రెండు క్వారీలను సబ్ కలెక్టర్ వికాస్ మహతో బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడి క్వారీల్లో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఇసుక తవ్వకాలు, అక్రమ తరలింపుపై 'క్వారీల్లో అక్రమాల జాతర.. నిబంధనలకు పాతర' శీర్షికన నమస్తే తెలంగాణ బుధవారం ప్రచురించిన కథనానికి సబ్ కలెక్టర్ స్పందించారు. క్వారీల్లో ఏం జరుగుతుందన్న విషయమై ముందుగా రెవెన్యూ సిబ్బందిని ఆరా తీసిన అనంతరం ఆయన.. బోధన్ తహసీల్దార్ విఠల్, బోధన్ రూరల్ సీఐ విజయ్‌బాబుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిద్దాపూర్‌లోని ట్రాక్టర్ల క్వారీని, సిద్దాపూర్ -ఖండ్‌గావ్ గ్రామాల మధ్య ఉన్న టిప్పర్ల క్వారీని పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని రెవెన్యూ సిబ్బందిని, వాహనాల యజమానులను హెచ్చరించారు. క్వారీ నుంచి వస్తున్న ట్రాక్టర్లను ఆపి వాటి వేబిల్లులను తనిఖీచేశారు. ఓవర్‌లోడ్‌తో వెళ్తే కేసులు పెడతామని, రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు తక్కువ స్పీడ్‌తో వెళ్లాలని సూచించారు. అయితే, సబ్ కలెక్టర్ వస్తున్న విషయం ముందుగానే లీక్ కావడంతో ఈ క్వారీలపై పెత్తనం చేస్తున్న వారు తగిన జాగ్రత్తలు తీసుకోవడం కొసమెరుపు.

సిద్ధాపూర్ క్వారీ నుంచి ఇసుకలోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ వే బిల్లును తనిఖీచేస్తున్న బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో

## దొడ్డు వడ్లకూ బోనస్ ఇవ్వాలి..

- లేదంటే బీఆర్ఎస్ పోరుబాట తప్పదు..
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి హెచ్చరిక

నిజామాబాద్, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రైతులకు బోనస్ ఎగ్గొట్టేందుకే రేవంత్ సర్కారు ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేసిందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. కొనుగోళ్లు చేపట్టకపోవడంతో రైతులు వడ్లను ప్రైవేట్‌లో అమ్ముకున్నారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలని, లేదంటే రైతుల తరపున బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని బుధవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చిందని, కానీ ఇప్పుడు కేవలం సన్న వడ్లకే బోనస్ ఇస్తామనడం రైతులను మోసం చేయడమేనని విమర్శించారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని ఘనంగా చెబుతున్నప్పటికీ, క్షేత్ర స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా జరగడం లేదని మండిపడ్డారు. ఎక్కడికక్కడ రైతులంతా రోడ్లపైనే వడ్లను ఆరబోసుకుని విక్రయానికి పడిగాపులు కాస్తున్నారని వివరించారు. ప్రభుత్వం బోనస్ ఎగ్గొట్టడానికే ధాన్యం కొనుగోళ్లలో ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేస్తుందన్నారు. ప్రభుత్వం వడ్ల కొనుగోలు జాప్యం చేయడం వల్ల విధి లేక రైతలంతా వడ్లను ప్రైవేటు, దళారులకు అమ్మి నష్టపోతున్నారని చెప్పారు. ప్రభుత్వం చేసిన జాప్యం వల్ల ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకున్న రైతులకు రూ.500 బోనస్ ఇవ్వాలన్నారు. ఏ రైతు ఎంత వరి వేశాడో వ్యవసాయ శాఖ వద్ద అన్ని వివరాలు ఉన్నాయని, వాటిని పరిగణనలోకి తీసుకుని బోనస్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఎకరానికి 25 క్వింటాళ్ల చొప్పున లెక్క కట్టి క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ చెల్లించి రేవంత్ ప్రభుత్వం చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. దొడ్డు వడ్లకు సైతం బోనస్ వర్తింపజేయాలని, లేని పక్షంలో రైతులతో కలిసి బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే బుధవారం కలిశారు. ఎర్రవల్లిలో కేసీఆర్‌ను కలవగా.. ఆప్యాయంగా పలుకరించారు. అనంతరం పలు అంశాలపై వారిద్దరూ చర్చించారు.
- బిచ్కుంద, నవంబర్ 20

## అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

దవాఖానలో మేయర్ భర్త దండు శేఖర్‌ను పరామర్శిస్తున్న రూరల్, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, ఆశన్నగారి జీవన్‌రెడ్డి

### నగర మేయర్‌కు ఎమ్మెల్సీ కవిత భరోసా

ఖలీల్‌వాడి, నవంబర్ 20 : నిజామాబాద్ మేయర్ నీతూకిరణ్ భర్త శేఖర్‌పై జరిగిన దాడిని ఎమ్మెల్సీ కవిత తీవ్రంగా ఖండించారు. అధైర్యపడొద్దని, బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మేయర్ కుటుంబానికి భరోసా ఇచ్చారు. రెండ్రోజుల క్రితం దాడికి గురైన శేఖర్ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలిసిన కవిత.. మేయర్‌కు బుధవారం ఫోన్ చేసి పరామర్శించారు. అధైర్యపడొద్దని, పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. శేఖర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

### పరామర్శించిన బాజిరెడ్డి, జీవన్‌రెడ్డి..

నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్న మేయర్ నీతూకిరణ్ భర్త దండు శేఖర్‌ను మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, జీవన్‌రెడ్డి, యెండల లక్ష్మీనారాయణ బుధవారం వేర్వేరుగా పరామర్శించారు. దవాఖానకు వచ్చిన బాజిరెడ్డి.. శేఖర్‌ను పరామర్శించి, మేయర్‌కు ధైర్యం చెప్పారు. జీవన్‌రెడ్డి కూడా దవాఖానకు చేరుకుని శేఖర్‌తో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తామంతా అండగా ఉన్నామని నీతూకిరణ్‌కు భరోసా ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ కూడా శేఖర్‌ను పరామర్శించారు.

కేసీఆర్, ప్రశాంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న సొసైటీ చైర్మన్ సూరజ్‌రెడ్డి, గ్రామస్తులు

బాల్కొండ, నవంబర్ 20: మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి చిత్రపటాలకు వన్నెల్(బీ) గ్రామస్తులు బుధవారం క్షీరాభిషేకం చేశారు. బీఆర్ఎస్ హయాంలో వన్నెల్ (బీ) నుంచి కొత్తపల్లి వరకు రోడ్డు నిర్మాణానికి ప్రశాంత్ రెడ్డి రూ.కోటి మంజూరు చేయించారు. తాజాగా ఈ పనులు పూర్తికావడంతో గ్రామస్తులు కేసీఆర్, వేముల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీ చైర్మన్ సూరజ్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు శ్రీకాంత్‌చారి, పన్నాల గంగారెడ్డి, రెంజర్ల సాయన్న, సాగర్‌యాదవ్, కన్న పోశెట్టి, ఫయాజ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ జోలికొస్తే అగ్నిగుండమే..

- విజయోత్సవ సభ కాదది.. కాంగ్రెస్ విషాద సభ
- కేసీఆర్ పాలనలో పురోగతి..
- రేవంత్ హయాంలో అధోగతి
- ప్రజలు తిరగబడడం ఖాయం
- మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి

ఖలీల్‌వాడి, నవంబర్ 20 : రైతులు, ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్ పార్టీ.. ఏ ముఖం పెట్టుకుని విజయోత్సవ సభ నిర్వహిస్తున్నదని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. రేవంత్ సర్కారు ఇలాగే వ్యవహరిస్తే ప్రజలు తిరగబడడం ఖాయమని హెచ్చరించారు. దేవుళ్లపై ఒట్లు పెట్టి, దేవుళ్లకే శరగోపం పెట్టిన ఘనుడు సీఎం రేవంత్‌రెడ్డి చెప్పేవన్నీ అబద్ధాలేనని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డికి పీసీసీ, సీఎం పదవులు కేసీఆర్ పెట్టిన భిక్షేనని, ఆనాడు చావునోట్లో తలపెట్టి కేసీఆర్ తెలంగాణ తేవడం వల్లే రేవంత్‌కు అవకాశమొచ్చిందని గుర్తుచేశారు. అలాంటి కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానని రేవంత్‌రెడ్డి అంటుండు. ఆయనను టచ్ చేసి చూడు రాష్ట్రం అగ్నిగుండమవుతుందని హెచ్చరించారు. నిజామాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వరంగల్‌లో జరిగింది విజయోత్సవ సభ కాదని, కాంగ్రెస్ విషాద సభ అని ఎద్దేవా చేశారు.

### అల్లకల్లోలమే..

కేసీఆర్‌ను ముట్టుకుంటే రాష్ట్రమంతా అల్లకల్లోలమవుతుందని జీవన్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ వటవృక్షమని, ఆయనను పెకిలించడం మీ గురువు చంద్రబాబు, వైఎస్సార్, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డిలతోనే కాలేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రైతుభరోసా, రుణమాఫీ, పదిరకాల పంటలకు మద్దతు ధర ఎటు పోయిందని నిలదీశారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను, కాంగ్రెస్ నాయకులను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, ఇదే మాదిరి పాలన కొనసాగితే గ్రామాలకు వస్తే అడ్డుకోవడం ఖాయమన్నారు.

### దాడి వెనుక కాంగ్రెస్ హస్తం..

కాంగ్రెస్ ప్రభుత్వంలో నిజామాబాద్ ప్రథమ పౌరురాలు నీతూకిరణ్ భర్తకు రక్షణ లేకుండా పోయిందని, ఇక సామాన్య ప్రజల పరిస్థితి వేరే చెప్పనక్కర్లేదని జీవన్‌రెడ్డి అన్నారు. పట్టపగలే బీఆర్ఎస్ నాయకులపై దాడులు చేస్తున్నారంటే కాంగ్రెస్ నాయకుల మద్దతే కారణమన్నారు. పీసీసీ ప్రెసిడెంట్ ఉన్న జిల్లాలో ప్రజలకు రక్షణ లేదన్నారు. దాడి చేసిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు రాజు, నేతలు తెలంగాణ శంకర్, సుజీత్‌సింగ్ ఠాకూర్, సత్యప్రకాశ్, రవిచంద్ర పాల్గొన్నారు.

### రైతులను నిలబెట్టింది బీఆర్ఎస్సే..

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గుజరాతీ గులామ్ అని రేవంత్‌రెడ్డి అంటుండు. రేవంత్‌రెడ్డి ఇటలీ గులామ్ అని కిషన్‌రెడ్డి అంటుండు. ఇలాంటి గులాంలు మనకు అవసరమా? తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీలను రద్దు చేయాలన్నారు. వరంగల్‌లో రేవంత్‌రెడ్డి మాటలు విని అబద్ధమే సిగ్గుతో తలదించుకున్నదని ఎద్దేవాచేశారు. మహారాష్ట్రలో సైతం అబద్ధపు ప్రచారాలు చేసి అబద్ధపు హామీలిచ్చారన్నారు. రైతులకు 9 హామీలిచ్చి ఒక్కటి అమలుచేసిన పాపాన పోలేదని గుర్తుచేశారు. రైతుల పక్షాన నిలిచింది బీఆర్ఎస్ పార్టీ అయితే, నేడు రైతులను నిండా ముంచింది కాంగ్రెస్ పార్టీ అని విమర్శించారు. ఫాదర్ ఆఫ్ ద లయ్యర్, తెలంగాణ ప్రజలకు డయ్యర్ రేవంత్‌రెడ్డి అన్నారు.



దుండగులు నిప్పంటించడంతో కొడిచర్ల శివారులో దగ్ధమైన చెక్‌పోస్టు

## చెక్‌పోస్టుకు నిప్పు

- ఇసుక మాఫియా దుండగులేనని అనుమానం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన తహసీల్దార్
- ఇసుక అక్రమరవాణాను అడ్డుకునేందుకు నెలక్రితం ఏర్పాటు

పొతంగల్, నవంబర్ 20 : ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. తహసీల్దార్ మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పొతంగల్ మండలంలోని కొడిచర్ల శివారు నుంచి సిరిపూర్ వెళ్లే దారిలో సుమారు నెల రోజుల క్రితం చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. చెక్‌పోస్టు వద్ద ప్రతి రోజూ రాత్రి 7 నుంచి ఉదయం 7 గంటల వరకు రెవెన్యూ, పోలీసు సిబ్బంది విధులు నిర్వర్తిస్తారు. సోమవారం సాయంత్రం అధికారులు విధుల్లోకి వెళ్లే సరికి చెక్‌పోస్టు కాలిపోయి కనిపించింది. ఇసుక అక్రమ రవాణాకు ఆటంకం ఏర్పడుతున్నదని, ఇసుక మాఫియా దుండగులే నిప్పుపెట్టి ఉంటారేని అనుమానం వ్యక్తం చేస్తూ తహసీల్దార్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు.